క్లుప్తంగా

గణపతి మట్టి ప్రతిమల పంపిణీ


ఉండి సెంటర్‌లో మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఉండి: ఉండి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని రుద్రరాజు నరసరాజు ఆర్థిక సహకారంతో సుమారు 300 మందికి ఆదివారం ఉండి సెంటర్‌లో వినాయకుని మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మీ, కన్నెగంటి రూత్‌కళ మాట్లాడుతూ వినాయకుని మట్టి విగ్రహాలను పూజ కొరకు వాడుకోవడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించినవారు అవుతామన్నారు. విషపూరితమైన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు వాడటం వల్ల తాగునీరు కలుషితం అవుతుందన్నారు. పర్యావరణంపై ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉండాలన్నారు. రుద్రరాజు నరసరాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, బొండాడ సూర్యబ్రమ్మానందం, వేగేశ్న మహేష్, కూనపరాజు రామసూరి, బొండాడ కేశవరావు, వీ సురేస్, సూర్యనారాయణరాజు, చంటి, శ్యామ్ పాల్గొన్నారు.

జంపన మృతికి నివాళి


జంపన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాగిరెడ్డి, పీవీఎల్

ఆకివీడు: జంపన సత్యనారాయణరాజు మృతి తీరని లోటని ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. సత్యనారాయణరాజు చిత్రపటానికి పూలమాలవేసి ఆదివారం నివాళులర్పించారు. నాగిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకుడు జంపన కృష్ణంరాజు తండ్రి సత్యనారాయణ అందరివాడుగా మెలిగారన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ కొల్లేరు తీరంలో సత్యనారాయణరాజు రైతు బిడ్డగా జన్మించి, ఆక్వా రంగాలో ముందుకు సాగుతున్నారని చెప్పారు. సత్యనారాయణరాజుకు నివాళులర్పించిన వారిలో జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ చైర్మన్ రసూల్ బీబీ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, క్షత్రియ సంఘ ప్రతినిధులు, పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన మోటుపల్లి కోట నాగసత్యనారాయణ కుటుంబ సభ్యులు 10 గ్రాముల బంగారం సమర్పించారు. దాతకు ఆలయ ఈఓ యర్రంశెట్టి భద్రాజీ, ధర్మకర్తలు ముత్యాల వెంకటరామరావు, సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అమ్మవారి శేషవస్త్రం అందజేశారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'విష్ణు'లో గ్రాడ్యుయేషన్ డే

సాక్షి, భీమవరం: విష్ణోత్సవ్ 2023 పేరిట విష్ణు మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డేను ఆదివారం ఘనంగా నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు తెలిపారు. 2019–23 బ్యాచ్‌కు చెందిన 783 మంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు, అలాగే 2021–23 బ్యాచ్‌కు చెందిన 19 మంది ఎంటెక్ విద్యార్థులు 57 మంది ఎంబీఏ విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లను ప్రదానం చేశామన్నారు. శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కేవీ విష్ణురాజు, వైస్ చైర్మన్ ఆర్.రవిచంద్రన్ మాట్లాడుతూ కేవలం ఉద్యోగాలపైనే దృష్టి పెట్టకుండా మంచి పారిశ్రామికవేత్తగా ఎదిగే ఉన్నత ఆలోచనలను కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ఆ అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరాజు, డీన్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

70 ఏళ్ల చరిత్రలో అపూర్వ ఘట్టం

పెనుగొండ: 70 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా రాష్ట్రానికి చెందిన ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఐక్యరాజ్య సమితి వేదికగా న్యూయార్క్‌లో జరుగుతున్న ఎస్‌డీజీ యాక్షన్ వీకెండ్ సదస్సులో పాల్గొనడం అపూర్వ ఘట్టమని, రాష్ట్రానికి గర్వ కారణమని ఏపీ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవ రెడ్డి అన్నారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ యూఎన్‌ఓ సదస్సులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొనడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారన్నారు. రాష్ట్రంలో విద్యార్థులను లీడర్లుగా చేసే లా విద్యా వ్యవస్థలో సంస్కరణలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని కొనియాడారు. ఏపీలో విద్యారంగంలో మార్పు మొదలైందన్నారు. నాడు నేడు పేరుతో తీర్చిదిద్ది కొత్త దనం తీసుకొచ్చారన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ దేశంలోనే ఉత్తమ విద్యార్థులు నిలవాలన్నారు.

కోలాహలంగా చవితి మార్కెట్


ట్రాక్టర్‌పై గ్రామాలకు వినాయక విగ్రహాల్ని తరలిస్తున్న దృశ్యం


బంతి, చేమంతి, చమ్కీ పూలదండలు దుకాణాల వద్ద రద్దీ


పత్రి, పండ్ల దుకాణం వద్ద విక్రయాలు

ఆకివీడు: వినాయక చవితి పండుగకు గ్రామగ్రామానా ఉత్సవాల నిర్వహణకు సర్వం సిద్ధమయ్యాయి. ఆదివారం రాత్రి చవితి ఉత్సవాలకు పలు చోట్ల ప్రత్యేక పందిళ్లు వేసి, పూజాసామగ్రిని సిద్ధం చేస్తున్నారు. స్థానిక వెలంపేట, పొట్టి శ్రీరాములు సెంటర్‌లో భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. పువ్వులు, పత్రి, పండ్ల విక్రయాలతో మార్కెట్‌లు కోలాహలంగా మారాయి. భారీ పూలదండలు, చెమ్కీ దండలు, పత్రి, పండ్లు కొనుగోలుకు జనం అధిక సంఖ్యలో తరలివచ్చారు. పట్టణంలోని అన్ని కూడళ్లలో దుకాణాల ఏర్పాటు చేయడంతో ప్రజల కొనుగోళ్లతో రద్దీగా మారాయి.

చవితికి సర్వం సిద్ధం

భీమవరం (ప్రకాశం చౌక్): సర్వవిఘ్నాలు తొలగించే వినాయక చవితి మహోత్సవాలు నిర్వహించుకునేందుకు గ్రామగ్రామానా ప్రజలు సర్వం సిద్ధం చేసుకున్నారు. చవితి పూజకు అవసరమైన గణపతి మట్టి విగ్రహాలు, పత్రి, పండ్లు, పువ్వులు తదితర పూజా సామగ్రి కొనుగోలుతో పట్టణంలోని దుకాణాలు కిటకిటలాడాయి. అలాగే పట్టణంలోని పలు చోట్ల ప్రత్యేక పందిళ్లు వేసి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాలను 3 నుంచి 11 రోజుల పాటు నిర్వహించనున్నారు.

చవితి సందడి ప్రారంభం

కాళ్ల: వినాయక చవితి పండగను పురస్కరించుకుని పల్లెల్లో సందడి ప్రారంభమైంది. ముఖ్యంగా గణనాథుడిని ఏర్పాటు చేసేందుకు భారీ పందిళ్లు వేస్తున్నారు. మండపాలను సుందరంగా అలంకరిస్తున్నారు. కాళ్ల, దొడ్డనపూడి, పెదఅమిరం, జువ్వలపాలెం, కోపల్లె, సీసలి, ఏలూరుపాడు గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సన్నాహాలు చేస్తున్నారు. విగ్రహాలను కొనుగోలు చేసి ఆటోలో, ఇతర వాహనాల్లో కోలాహలంగా పందిళ్ల వద్దకు తరలిస్తున్నారు.


భీమవరంలో మట్టి విగ్రహాలు, పండ్ల విక్రయాలు


భీమవరంలో పత్రి విక్రయిస్తున్న దృశ్యం


కాళ్లకూరులో ఏర్పాటు చేస్తున్న వినాయకుడి మండపం

చవితి వేడుకలకు సిద్ధం

పాలకోడేరు: వినాయక చవితి సందర్భంగా ఆదివారం మార్కెట్ కళకళలాడింది. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పువ్వులు, పత్రి, వినాయకుని ప్రతిమల దుకాణాలు వెలిశాయి. ప్రజల్లో పర్యావరణ స్పృహ పెరగడంతో రంగుల విగ్రహాలకన్నా మట్టి ప్రతిమలను కొనేందుకే ఆసక్తి చూపారు. కొన్ని గ్రామాల్లో పర్యావరణ ప్రేమికులు మట్టితో చేసిన ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా గ్రామాల్లోని అనేక కూడళ్లలో పందిళ్లు వేసి, పెద్ద వినాయకుని విగ్రహాలను కొలువుతీర్చారు.

మండపాల వద్ద సందడి

వీరవాసరం: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల వ్యాప్తంగా ఉన్న వినాయక ఆలయాలు, మండపాల వద్ద సర్వం సిద్ధం చేశారు. మామిడి తోరణాలు, చలువ పందిళ్లతో, విద్యుత్ కాంతుల దీపాలతో మండపాలన్నీ కళకళలాడుతున్నాయి. పండ్లు, పూలు దుకాణాలు రద్దీగా మారాయి.

జల్‌జీవన్ మిషన్ పనులకు భూమిపూజ


వేండ్రలో ఓహెచ్‌ఆర్ నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్న పీవీఎల్

పాలకోడేరు: గ్రామాల అభివృద్ధికి జగనన్న ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆదివారం జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా వేండ్ర, పెన్నాడ గ్రామాల్లో ఓహెచ్‌ఆర్, పైప్‌లైన్ల నిర్మాణ పనులకు పీవీఎల్ భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేండ్ర గ్రామంలో రూ.57 లక్షల వ్యయంతో 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్, పెన్నాడ గ్రామంలో సుమారు రూ.84 లక్షలతో 1లక్షా 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్‌ను, అలాగే పైప్‌లైన్ నిర్మాణాలకు జల్‌జీవన్ పథకంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో త్వరలో శుద్ధి నీటి జలాలు సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. పెన్నాడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా విడుదలైన రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను పీవీఎల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూపతిరాజు చంటి రాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు, కటిక శ్రీదేవి, భూపతిరాజు రాంబాబు సర్పంచ్‌లు కడలి నాగేశ్వరి చిల్లా అనూష, చింతపల్లి వెంకటనారాయణ, ఎంపీటీసీ సభ్యులు పాలా జ్యోతి చిన్నా, ఆరేపల్లి పెద్ద వెంకటస్వామి, వైస్ ఎంపీపీలు షోడదాసి నరేష్, ఆదాడ లక్ష్మీ తులసి, గూడూరి కిరణ్ పాల్గొన్నారు.

వైభవంగా గోవింద కల్యాణోత్సవం


ఆకివీడులో గోవింద కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆకివీడు: గోవింద నామస్మరణతో ఆదివారం పట్టణం మార్మోగింది. మాదివాడలోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి భక్తులు, కల్యాణ దంపతులు స్వామి వారి పల్లకి ఊరేగింపును ఆర్య వైశ్య కల్యాణ మందిరం వరకు నిర్వహించారు. అనంతరం 108 మంది దంపతులు రామానుజ ప్రియ గోవింద కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. రాజమండ్రికి చెందిన పరాశర రఘునాథ భట్టర్ స్వామి పర్యవేక్షణలో భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. సాక్షాత్తూ తిరుమలలో జరిగే వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం మాదిరిగానే ఇక్కడ కల్యాణం జరగడంతో భక్తులు పులకించారు. అనంతరం భక్తులకు తిరుమల తిరుపతి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.

కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి


కలెక్టరేట్‌లో విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): సకల చరాచర సృష్టికి మూల కారకుడైన ఆదిపురుషుడు విరాట్ విశ్వకర్మ అని, ఆయన దైవసమానులని జిల్లా వెనుకబడి తరగతుల సంక్షేమ శాఖ అధికారి జీవీఆర్‌కేఎస్ఎస్ గణపతిరావు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆదివారం జిల్లా వెనుకబడి తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విశ్వకర్మ జయంతిని ప్రభుత్వ వేడుకగా నిర్వహించాలని ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వృత్తులకు ఆద్యుడైన విశ్వకర్మ జయంతిని ఏటా సెప్టెంబర్ 16న నిర్వహిస్తారని, ముఖ్యంగా కర్మాగారాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో వేడుకలు జరుగుతుంటాయన్నారు. కార్మికులు వారి పనిముట్లను విశ్వకర్మ చిత్రపటం ముందుంచి పూజిస్తారన్నారు. ఈ రోజునే భారతీయులు శ్రామిక దినోత్సవంగా కూడా జరుపుకుంటారన్నారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ టి.ప్రసాద్, ఏబీసీ డబ్ల్యూఓ కలిదిండి వెంకటేశ్వరరావు, హెచ్‌డబ్ల్యూఓలు కడలి శ్రీను, కె.నాగమోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి


భీమవరంలో ఉత్సవ కమిటీల నిర్వాహకులకు గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న గ్రంధి రవితేజ

వినాయక విగ్రహాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గ్రంధి కుటుంబ సభ్యులు

భీమవరం (ప్రకాశంచౌక్): వినాయక చవితిని పురస్కరించుకుని గణపతి ఉత్సవ విగ్రహాలను నియోజకవర్గంలోని పలు ఉత్సవ కమిటీలకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఆదివారం పంపిణీ చేశారు. ఒక అడుగు నుంచి 20 అడుగుల వరకు ఉన్న విగ్రహాలను ఉత్సవ కమిటీలు అడిగిన విధంగా సిద్ధం చేసి వారికి పంపిణీ చేశారు. హిందూ సంప్రదాయాన్ని మరింత పెంపొందించడంతోపాటు, మతసామరస్యం పెరగాలంటూ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉత్సవ విగ్రహాలను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు గ్రంధి రవితేజ, కుటుంబ సభ్యుల చేతుల మీదుగా వినాయక చవితి ఉత్సవ కమిటీలకు అందజేశారు. దీంతో భీమవరం వ్యాప్తంగా చలువ పందిళ్లలో ఏర్పాటు చేసేందుకు ఈ ఉత్సవ విగ్రహాలను నిర్వాహకులు తరలించడంతో పట్టణంలో అప్పుడే పండుగ కోలాహలం ఏర్పడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు రవితేజ మాట్లాడుతూ విఘ్నేశ్వరుడిని పూజించి సర్వవిఘ్నాలు తొలగి అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్, భీమవరం మండల కన్వీనర్ తిరుమాని ఏడుకొండలు, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, మావుళ్ళమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మానేపల్లి నాగన్న బాబు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, భీమవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల సత్యనారాయణ రాజు, కాకిలేటి బాసు, చెల్లబోయిన సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కారుమూరి పరామర్శ


మల్లికార్జునరావును పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి

కాళ్ల: బొండాడలో మాజీ ఎంపీపీ కందుల వెంకట మల్లికార్జునరావును మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. ఇటీవల మల్లికార్జునరావు భార్య నాగమణి మరణించగా, ఆమె చిత్రపటానికి మంత్రి కారుమూరి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

పాలకోడేరు: స్థలం తగాదాపై సచివాలయానికి వెళితే తనపై భార్యాభర్తలు దౌర్జన్యం చేశారని పెన్నాడకు చెందిన దళిత నాయకుడు కోరం మునలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. స్థలం తగాదా విషయంలో తాను గొరగనమూడి సచివాలయానికి ఈ నెల 13న వెళ్లగా అక్కడ అదే గ్రామానికి చెందిన ఆనందం శ్రీనివాస్ అతని భార్య కలిసి తనపై దౌర్జన్యం చేశారని మునలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

సంచార వైద్యశాల ద్వారా పరీక్షలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన సంచార వైద్యశాల ద్వారా ఆదివారం 13 మంది వృద్ధులకు ఇళ్లకు వెళ్లి ఉచితంగా వైద్యసేవలు అందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. తణుకుకు చెందిన ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ సంచార వైద్యశాల ద్వారా పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి వైద్య సేవలందించినట్లు చెప్పారు. అసోసియేషన్ సభ్యురాలు ఆలపాటి మాధవి ఆర్థికసాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. సాయిస్వేత డయాగ్నస్టిక్ సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు.

జీఈఆర్ సర్వేపై అధికారుల సంతృప్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): బడిఈడు పిల్లలు బడిలోనే ఉండేలా చేపట్టిన జీఈఆర్ సర్వే పాదర్శకంగా జరిగిందని మునిసిపల్ కమిషనర్ శామ్యూల్, తాడేపల్లిగూడెం ఎంఈఓ పీఎంకే జ్యోతి తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహించిన జీఈఆర్ సర్వేపై ఆదివారం సాయంత్రం పలు వార్డులలో వెరిఫికేషన్ టీం ఆధ్వర్యాన పరిశీలించారు. పట్టణంలో కమిషనర్, ఎంఈఓ, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సీఆర్‌పీలు, అలాగే మండలంలో ఎంపీడీఓ విశ్వనాథం, ఏపీఓఆర్‌డీ వెంకటేష్ ఆధ్వర్యాన పరిశీలన చేసిన అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న పీవీఎల్ నర్సింహరాజు


క్యాంప్ కార్యాలయంలో పూజలు చేస్తున్న పీవీఎల్

ఆకివీడు: శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, యాగాలు నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ప్రత్యేక పూజలు చేయడం అభినందనీయమన్నారు. విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం గుర్తించి అమలుజేస్తోందన్నారు. వివిధ చేతివృత్తిదారులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలుజేస్తున్నాయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలు అమలుకు విశ్వకర్మ జయంతి, కార్మిక దినోత్సవం ఉపయోగపడుతుందని చెప్పారు. విశ్వకర్మ మహాయజ్ఞం, పూజలలో పాల్గొన్న దంపతుల్ని పీవీఎల్ అభినందించి, ఆశీర్వదించారు. త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ చైర్మన్ రసూల్ బీబీ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్, శిరపు శ్రీనివాస్, పుప్పాల పండు, స్వర్ణకార సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పట్నాల శేషగిరిరావు, వేల్పూరి రామాచార్యులు, గెద్దం సత్తిబాబు, విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షకోశాధికారి ఎం.వెంకటపతి సన్నిబాబు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయంలో..

కాళ్ల: వైఎస్సార్ సీపీ క్యాంప్ కార్యాలయంలో విశ్వకర్మ జయంతి జరుపుకోవడం ఆనందంగా ఉందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా పెదఅమిరంలో వైఎస్సార్ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం పీవీఎల్ పార్టీ నాయకుల సమక్షంలో శ్రీ.విరాట్ విశ్వకర్మ భగవాన్‌స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ బ్రాహ్మణులు, భక్తులు, నాయకులు పాల్గొన్నారు.